సాక్షి
రంగారెడ్డి
మంగళవారం। 15। ఆగస్టు। 2023



రాత్రివేళ రిజిస్ట్రేషన్లు!

నందిగామ తహసీల్దార్ కార్యాలయంలో రాత్రి వేళ భూముల రిజిస్ట్రేషన్లు జోరుగా కొనసాగుతున్నా యి. 10లో▸



'కు.ని.' పునరుద్ధరించండి

పట్నం ప్రభుత్వాస్పత్రిలో కు.ని. ఆపరేషన్లు పునరుద్ధరించాలని మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ కోరారు. 10లో▸



లక్ష మందితో చేవెళ్ల సభ

చేవెళ్లలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. 10లో▸

10 రోజులు 12 రూ.కోట్లు



మద్యం దుకాణాలకు దరఖాస్తుల 'కిక్కు'

పలు షాపులకు పోటాపోటీ

- మరో మూడు రోజుల్లో ముగియనున్న గడువు
- అప్లికేషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం

జిల్లాలో మద్యం షాపులు.. దరఖాస్తులు

ఎక్సైజ్‌జిల్లా	షాపులు	వచ్చిన దరఖాస్తులు
సరూర్‌నగర్	134	2,700
శంషాబాద్	100	3,300



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మద్యం షాపులకు దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో గడువు ముగియనుండడంతో దరఖాస్తులు దాఖలు చేసేందుకు సోమవారం క్యూకట్టారు. సరూర్‌నగర్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో 134 షాపులు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 2,700పైగా దరఖాస్తులు వచ్చాయి. శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో వంద షాపులు ఉండగా, 3,300 వచ్చాయి. ఇన్నర్‌రింగ్‌రోడ్డుకు అటు ఇటుగా ఉన్న ఒక్కో షాపునకు సగటున 25 దరఖాస్తులు రావడం విశేషం. ఎలాగైనా షాపులను దక్కించుకోవాలనే ఉద్దేశంతో కొంతమంది వ్యాపారులు సిండికేట్‌గా మారి.. బినామీ పేర్లతో ఒకే షాపుపై టెండర్లు దాఖలు చేస్తున్నారు. ఒకరు టెండరు వేసిన చోట మరొకరు వేయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలా ఇప్పటి వరకు కేవలం ఈ దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి సుమారు రూ.12 కోట్ల ఆదాయం సమకూరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నెల 18తో దరఖాస్తుకు గడువు ముగియనుంది. వచ్చే చివరి మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాపులకు దరఖాస్తులు భారీగా వచ్చాయి. ఈ ఒక్క స్టేషన్ పరిధిలోనే 1,700 పైగా రావడం గమనార్హం.

21న లక్కీడ్రా

మద్యం షాపుల లైసెన్సుల గడువు నవంబర్ 30తో ముగియనుంది. డిసెంబర్ నుంచి కొత్త లైసెన్సుల విధానం అమల్లోకి రావాల్సి ఉంది. అంతకు ముందే సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో ప్రభుత్వం అప్రమత్తమై ముందస్తు లైసెన్సుల జారీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 4న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది. ఒక్కో దరఖాస్తుకు ఫీజు రూ.2 లక్షలుగా(నాన్ రిఫండబుల్) నిర్ణయించింది. ఈ పది రోజుల్లోనే 234 షాపులకు 6,000 దరఖాస్తుల అందడం విశేషం. గతంలో మాదిరే ఈసారి కూడా గౌడ, ఎస్సీ, ఎస్టీ కులాలకు రిజర్వేషన్లు వర్తింపజేసింది. ఈ మేరకు లాటరీ ద్వారా ఆయా కులాలకు కేటాయించే షాపుల సంఖ్యను నిర్ధారించింది. ఈ నెల 21న శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో లక్కీడ్రా నిర్వహించనుంది. ఈ డ్రా ద్వారా దరఖాస్తుదారులకు షాపులను కేటాయించి, ఆయా షాపులకు 30న కొత్త సరుకును అందజేయనుంది.

రిజర్వేషన్ల వారీగా వైన్‌షాపుల కేటాయింపు ఇలా..

ఎక్సైజ్ జిల్లా	గౌడ్స్	ఎస్సీ	ఎస్టీ	ఓపెన్ కేటగిరీ
హైదరాబాద్	5	4	1	70
సికింద్రాబాద్	6	7	1	85
మల్కాజిగిరి	12	7	1	68
మేడ్చల్	11	5	1	97
సరూర్‌నగర్	25	11	2	96
శంషాబాద్	9	6	-	85
వికారాబాద్	6	9	2	42



స్వాతంత్య్ర సంబరాలకు సర్వం సిద్ధం

- కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి సబిత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భారత స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో మంగళవారం ఉదయం 11 గంటలకు మంత్రి సబితారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. పోలీసు వందన స్వీకరణ తర్వాత జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలు సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్ సముదాయాన్ని అందగా ముస్తాబు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు విద్యా సంస్థల్లోనూ జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు, ప్రముఖుల ప్రసంగాలు, సన్మానాల వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చారిత్రక కట్టడాలు, పలు కార్పొరేట్ కార్యాలయాలు, ఐటీ అనుబంధ సంస్థలు, పరిశ్రమల్లో విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. జాతీయ జెండాలు, స్టిక్కర్లు, విద్యార్థులకు బహుమతుల కొనుగోళ్లతో స్టేషనరీలు బిజీగా మారాయి.

జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగనిరతి, నిబద్ధతతో ఎంతో మంది దేశ స్వాతంత్య్రం కోసం పోరాడారని, వారి బాటను అందరం అనుసరిద్దామని పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర సాధన కోసం జరిగిన పోరాటంలోని ఉజ్వల ఘట్టాలను, స్వాతంత్య్ర సమరవీరుల మహోన్నత త్యాగాలను యావత్ భారత జాతి సగర్వంగా స్మరించుకుంటోందన్నారు. వారు నెలకొల్పిన విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వరాష్ట్రం సాధించుకున్న నాటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు.

నోట్‌బుక్స్ తెచ్చుకుంటానని వెళ్లి..

- ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్య



గౌతమ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: నోట్‌బుక్స్ తెచ్చుకుంటానని హాస్టల్ గదిలోకి వెళ్లి ఇంటర్మీడియెట్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్‌కు చెందిన చింతకుంట గౌతమ్ (16) బొంగ్లూర్ సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వారం రోజుల క్రితం కళ్లకలక రావడంతో స్వగ్రామానికి వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి కళాశాలకు వచ్చాడు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యార్థులతో కలిసి చదువుకున్నాడు. సాయంత్రం 5 గంటల సమయంలో స్టడీ అవర్స్‌లో నోట్‌బుక్స్ తెచ్చుకుంటానని స్నేహితులకు చెప్పి హాస్టల్ గదికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో విద్యార్థులు వెతకగా హాస్టల్ గదిలో ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే తుర్కయంజాల్‌లోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే గౌతమ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఎస్ఐ కృష్ణయ్య సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

పంచాయతీ రికార్డుల నమోదులో అలసత్వం వద్దు



తక్కళ్లపల్లితండాలో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

యాచారం: పంచాయతీ రికార్డుల నమోదులో నిర్లక్ష్యం తగదని, ఖర్చు చేసే ప్రతి పైసాకు లెక్కాలుండాల్సిందేనని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నాలుగేళ్ల విధులు పూర్తి చేసుకున్న గడ్డమల్లయ్యగూడ, నానక్‌నగర్, కుర్మిద్ద, తక్కళ్లపల్లితండాల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పంచాయతీ రికార్డులను పరిశీలించారు. నాలుగేళ్లుగా ఆయా గ్రామాల్లో ఏఏ అభివృద్ధి పనులు చేశారు, ఖర్చు చేసిన నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన నిధుల రికార్డుల నమోదును పరిశీలించారు. అనంతరం తక్కళ్లపల్లి తండాలో ఉన్న బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. మొక్కలు నాటే విషయంలో, పెంచే విషయంలో బాధ్యతగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి ఉన్నారు.

మాస్టర్‌ప్లాన్ తయారీపై చర్చ



వివరాలు సేకరిస్తున్న డీటీసీపీ రీజనల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు

కడ్తాల్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రీజినల్ డైరెక్టర్ (డీటీసీపీ) పీవీఆర్ నర్సింహారెడ్డి, ఏడీ సత్యభామ, టౌన్‌ప్లానింగ్ అధికారి భాగ్యలక్ష్మి కడ్తాల్ పూర్వపు రెవెన్యూ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడ్తాల్ పూర్వపు రెవెన్యూ పరిధిలోని కడ్తాల్, అన్మాస్‌పల్లి, గానుగుమార్ల తండా, గడ్డమీది తండా, కొండ్రిగానిబోడ్ తండా, మైసిగండి, పెద్దవేములోనిబావి తండాలతో కలిపి మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి ఇండికేటివ్ ల్యాండ్ యూస్ ప్లాన్ ముసాయిదా తయారుపై చర్చించారు. కడ్తాల్ పూర్వపు రెవెన్యూ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి మండల కేంద్రంతో పాటు, పూర్వపు రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్‌ల వివరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు, ప్రముఖ కట్టడాలు, స్థలాలు, రహదారులు, నక్షదారులు, ప్రభుత్వ భూములపై సమగ్రంగా చర్చించారు. ఆయా పంచాయతీ కార్యదర్శులు సూచించిన మార్పులు, చేర్పులను పరిగణలోకి తీసుకుని, పూర్వపు కడ్తాల్ రెవెన్యూ పంచాయతీని కలిపి ముసాయిదా సిద్ధం చేయడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీవో మధుసూదనాచారి, కడ్తాల్ పూర్వపు రెవెన్యూ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధునిక వంగడాలు కనుక్కోవాలి

హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ పటేల్



హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ పటేల్‌తో వ్యవసాయ శాస్త్రవేత్తలు

నందిగామ: వ్యవసాయ రంగంలో ఆధునిక వంగడాలు, ఆధునిక పద్ధతులను కనిపెట్టాల్సిన అవసరం యువ శాస్త్రవేత్తలపై ఉందని శ్రీరామ చంద్ర మిషన్ (హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ) గురూజీ కమ్లేష్ పటేల్ అన్నారు. మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)తో కలిసి కన్నడ యువ వ్యవసాయ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడం కోసం సోమవారం ఆగ్రో యూత్ సమ్మిట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమ్లేష్ పటేల్ మాట్లాడుతూ.. దేశ యువతలో వ్యవసాయ రంగానికి సంబంధించిన సాధికారతను పెంపొందింపజేసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలకు సరైన శిక్షణ ఇవ్వడంతో పాటు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకునేందుకు వారిని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సమ్మిట్ మంగళవారంతో ముగుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ మీడియా కో ఆర్డినేటర్ చేతన్ గోనాయక్, మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.సురేష్ చంద్ర, కర్ణాటక వ్యవసాయ యువ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఏఎన్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్ఎంలు గ్రామాల్లో తిరిగి గర్భిణులను గుర్తించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి చేయించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. టీటీ వ్యాక్సినేషన్, ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేయాలని, ఎనిమియా వ్యాధి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ఏఎన్ఎంలపై ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి అయిన వెంటనే లబ్ధిదారులకు కేసీఆర్ కిట్టు, ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం అందజేయాలని సూచించారు. సంవత్సరంలోపు చిన్నారులకు వ్యాధి నిరోధరక టీకాలు తప్పనిసరిగా ఇవ్వాలని, గ్రామాల్లో మధుమేహం, బీపీ వ్యాధిగ్రస్తులను గుర్తించి మందులు పంపిణీ చేయాలని వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు పౌష్టికాహారం, ఆహారపు అలవాట్ల గురించి వివరించాలని, ఫార్మాసిస్టులు ఆరోగ్య కేంద్రాలకు కావాల్సిన మందులను జిల్లా కేంద్రం నుంచి ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలని, మందుల కొరత లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో బీపీ, మధుమేహం ఉన్న వారిని గుర్తించి వారికి మందులను అందజేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డివిజన్ వైద్యాధికారులు, హెల్త్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం 'రియల్' బ్రోకర్‌గా మారింది



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

బడంగ్‌పేట్: ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా మారి దళితుల భూములు లాక్కోవడమే పనిగా పెట్టుకుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని దావుత్‌ఖాన్‌గూడ సర్వేనంబర్-2లో కొన్ని రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న దళిత కుటుంబాలకు సోమవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొజీషన్‌లో ఉంటే పట్టాలివ్వాలన్న సోయే ఈ ప్రభుత్వం మరిచిందని దుయ్యబట్టారు. దళితులకు మూడెకరాలు ఇస్తానన్న హామీ అటుంచితే ఉన్న భూములను లాక్కొనేందుకు ప్రయత్నిస్తోందన్నారు. రింగ్‌రోడ్డు వచ్చిన తర్వాత దళితుల భూములపై కేసీఆర్ కన్నుపడిందన్నారు. దానికి కొత్తగా భూ ప్రక్షాళన అని పేరుపెట్టి భూ దోపిడీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ధరణి పేరుతో అసైన్డ్ భూములకు కాగితాలు లేకుండా చేశాడన్నారు. ఇప్పటి వరకు 5,800 ఎకరాల దళిత భూములను గుంజుకున్నారని ఆరోపించారు. ఆ భూములకు మార్కెట్ రేట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దగాపడ్డ దళితులకు అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగే వరకు ఎన్నిసార్లు జైలుకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, బీఎంసీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ

మంత్రి సబితారెడ్డి



దివ్యాంగ బాలబాలికలకు సహాయ పరికరాలు అందజేసిన మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మార్పులు తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి సిర్లాహిల్స్‌లోని ప్రాథమిక పాఠశాలలో రూ.38 లక్షలతో చేపట్టిన భవన పునర్నిర్మాణ పనులకు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సమస్యలు ఉండేవని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక వాటిని బాగు చేసుకోవడంతో పాటు విద్యార్థుల స్థితిగతులు మార్చేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అందులో భాగంగానే కేజీ టూ పీజీ విద్య, గురుకులాలకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల మంది పిల్లలకు విద్య అందిస్తూ ఒక్కో విద్యార్థికి రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తోందని తెలిపారు. మనబస్తీ-మనబడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేసి సకల సౌకర్యాలను కల్పిస్తోందని వివరించారు. తొలిమెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ముందే పుస్తకాలు అందజేసి ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నెలలో ఒకసారి పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకుని తల్లిదండ్రులను భాగస్వాములను చేసి విద్యార్థుల స్థితిగతులను వివరించాలని మంత్రి సూచించారు. అనంతరం 30 మంది దివ్యాంగ బాల,బాలికలకు మంత్రి సహాయ పరికరాలు, ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, డీఈఓ సుశీందర్‌రావు, ఎంఈఓ కృష్ణయ్య, స్థానిక కార్పొరేటర్ భిక్షపతిచారి, ప్రధానోపాధ్యాయులు గంగాధర్, కార్పొరేటర్లు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ విజయపురి కాలనీలో రూ.5.98 కోట్లతో నిర్మించ తలపెట్టిన ట్రంక్‌లైన్ నిర్మాణ పనులు, రూ.31 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తాతో కలిసి మంత్రి సబితా రెడ్డి శంకుస్థాపన చేశారు. కాలనీలో రూ.31 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మంత్రి కేటీఆర్ గారి ప్రత్యేక చొరవతో హైదరాబాద్ విశ్వనగరంగా మారుతోందన్నారు. అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు, వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి చేపట్టడం జరుగుతుందన్నారు. మెట్రో విస్తరణతో అభివృద్ధి శరవేగంగా జరగనుందని, శివారు ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు పెరుగుతాయన్నారు. నాలాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, ఈస్ట్‌జోనల్ కమిషనర్ పంకజ బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

గునుగల్ రిజర్వాయర్ పరిశీలన

యాచారం: మండలంలోని గునుగల్ గ్రామంలో ఉన్న కృష్ణాజలాల రిజర్వాయర్‌ను సోమవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ విజిలెన్స్ డీఎస్పీ జ్ఞానేందర్‌రెడ్డి సందర్శించారు. రిజర్వాయర్‌లో ఉన్న ఫేస్ ఒకటి, రెండు, మూడు సంపులను పరిశీలించారు. రిజర్వాయర్‌లో క్లోరినేషన్‌కు సంబంధించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో ఇబ్బందులు రానియొద్దని సూచించారు. ఆయన వెంట విజిలెన్స్ సీఐ మనోజ్‌కుమార్ ఉన్నారు.



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ జ్ఞానేందర్‌రెడ్డి

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

- రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

శంకర్‌పల్లి: అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. మండలంలోని కొండకల్ సమీపంలో ఉన్న ఇండస్ ఇంటర్నేషనల్ ప్రాచీన్ గ్లోబల్ స్కూల్‌లో సోమవారం చిల్డ్రన్ సేఫ్టీ క్లబ్‌పై అవగాహన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో చిల్డ్రన్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేసి వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో జరుగుతున్న మోసాలపై పిల్లలు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అమ్మాయిలు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని లేదంటే షీటీం 94906 17444 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రతి అమ్మాయికి గుడ్, బ్యాడ్ టచ్‌లకు సంబంధిచిన విషయాలను ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు. సైబర్‌నేరాలతో జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయకూడదని సూచించారు. ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు చెప్పకూడదని, ఫోన్‌లో వచ్చే లింక్‌లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. డ్రైవర్లకు సంబంధించిన పూర్తి సమాచారం పాఠశాల యాజమాన్యల వద్ద ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మోకిల సీఐ నరేశ్‌కుమార్, ఎస్ఐలు కృష్ణ, కోటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాటికి పంపిన కలప ట్రాక్టర్

- అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- అన్నోజిగూడ సమీపంలో ఘటన


పుచ్చల గణేశ్(ఫైల్)

కందుకూరు: కలప లోడ్‌తో అతివేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అన్నోజిగూడకు చెందిన ఎడ్ల అంజయ్య 20 ఏళ్ల క్రితం కటికపల్లికి ఇల్లరికం వెళ్లాడు. ఈయన వ్యవసాయ పొలాలు అన్నోజిగూడలోనే ఉన్నాయి. కాగా అనారోగ్యం బారిన పడిన అంజయ్య సోమవారం ఉదయం మృతి చెందాడు. దీంతో అతని బంధువులు.. కటికపల్లి వెళ్లి అంత్యక్రియల నిమిత్తం అంజయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో పుచ్చల గణేశ్(45) గ్రామానికి చెందిన యాదయ్యను తన బైక్‌పై ఎక్కించుకుని.. మృతదేహాన్ని తరలిస్తున్న వాహనం వెనకాలే వెళ్తున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో అన్నోజిగూడ వద్దకు చేరుకోగానే కట్టెల లోడ్‌తో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. గణేశ్ టైర్ కింద పడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే ప్రాణం విడిచాడు. వెనక కూర్చున్న యాదయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి, గణేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య సంతోష వార్డు సభ్యురాలు కాగా, మృతుడు ముదిరాజ్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రావణ్ తెలిపారు.

రాత్రి వేళ రిజిస్ట్రేషన్లు!

నందిగామలో అధికారుల వింతపోకడ

- 'రెవెన్యూ' పని తీరుపై విమర్శలు



నందిగామ తహసీల్దార్ కార్యాలయం

నందిగామ: నగరానికి అతి సమీపంలో ఉన్న నందిగామ తహసీల్దార్ కార్యాలయంలో రాత్రి వేళ భూముల రిజిస్ట్రేషన్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ విషయంలో అధికారుల తీరు చర్చనీయాంశంగా మారింది. అక్రమార్జనకు అలవాటుపడిన కొంతమంది అధికారులు ఎప్పుడు పడితే అప్పుడు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాజాగా వెలుగులోకి..

మండల కేంద్రానికి అతిసమీపంలో 44వ నంబరు జాతీయ రహదారి(బైపాస్)కి ఆనుకుని ఉన్న ఓ వివాదాస్పద భూమిలో నుంచి 35 ఎకరాలను స్థానిక గత నెల 15న రాత్రి 8:30 గంటలకు రిజిస్ట్రేషన్ చేసిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. రూ.కోట్లు విలువ చేసే సదరు భూమికి సంబంధించిన వివాదం కోర్టులో కొనసాగుతోంది. గత ఏప్రిల్‌లో ఈ భూమికి సంబంధించి న్యాయస్థానం స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని తుంగలో తొక్కిన అధికారులు.. ఆగమేఘాల మీద రాత్రి వేళ రిజిస్ట్రేషన్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సల్వేంద్రిగూడ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఓ వివాదాస్పద భూమిని సైతం ఇటీవల కన్వర్షన్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

కొత్తగా వచ్చా..

ఈ విషయమై తహసీల్దార్ అయ్యప్పను అడగగా.. తాను మూడు రోజుల క్రితమే బాధ్యతలు తీసుకున్నానని, పాత రిజిస్ట్రేషన్ల గురించి పూర్తిగా తెలియదని చెప్పారు. రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా జరిగేలా చూస్తామన్నారు.

స్లాట్ బుక్ అయ్యింది..

ఇదే విషయమై నాయబ్ తహసీల్దార్ విజయ్‌కుమార్ అడగగా నందిగామ శివారులోని 35 ఎకరాల భూమికి సంబంధించి స్లాట్ బుక్ కావడంతో రిజిస్ట్రేషన్ చేశామన్నారు. కోర్టు కేసు విషయం తమకు తెలియదని చెప్పారు. పవర్ బ్యాకప్ సమస్య ఉన్నందున రాత్రి వేళలో రిజిస్ట్రేషన్ చేయాల్సి వచ్చిందని చెప్పారు.

కు.ని ఆపరేషన్లు పునరుద్ధరించండి

- మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ
- ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా


ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న మహిళా సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పునరుద్ధరించాలని మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ, ప్రధాన కార్యదర్శి సుమలత డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు వికటించి ఆరునెలల క్రితం నలుగురు బాలింతలు మృతి చెందడంతో నాటి నుంచి ఆపరేషన్లు చేయడం లేదన్నారు. తప్పులు సరి చేసి పొరపాటు జరగకుండా చర్యలు తీసుకోకుండా పూర్తిగా సేవలు నిలిపివేయడం ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమన్నారు. నియోజకవర్గ పరిధిలోని పేదలకు ఆర్థిక స్తోమత లేక.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధుల హామీ మేరకు ఇబ్రహీంపట్నం ఆస్పత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేసి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేపట్టాలని కోరారు. మౌలిక సదుపాయాలు కల్పించి, అర్హులైన వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ఉమా, కృష్ణవేణి, విజయ, ఏలిషామ్మ, ఇందిర పాల్గొన్నారు.

పశువుల పట్టివేత

యాచారం: కబేళాకు అక్రమంగా తరలిస్తున్న పశువులను యాచారం పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. నల్గొండ జిల్లా మల్లేపల్లి నుంచి ఆదివారం అర్ధరాత్రి ఒక డీసీఎంలో పది పశువులను నగరంలోని కబేళాకు తరలిస్తున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా యాచారం పీఎస్ సమీపంలో అక్రమంగా పశువులు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఆ పశువులను పట్టుకుని నగరంలోని గోశాలకు తరలించారు. పశువుల్లో తీవ్ర గాయాలైన ఓ ఆవు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గ పరిధిలో ఈ నెల 17న మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంత్రుల పర్యటన సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని రూ.68.21 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీలు కృపేశ్, నర్మద, నాయకులు కృష్ణగౌడ్, సత్తయ్య, రాములు, జంగయ్య, రమేశ్, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష మందితో చేవెళ్ల సభ


చేవెళ్ల సభ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి, డీసీసీ అధ్యక్షుడు

- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఇక్కడి నుంచే ప్రకటిస్తాం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్ల: చేవెళ్లలో లక్ష మందితో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. పట్టణంలో ఈ నెల 18న నిర్వహించనున్న బహిరంగ సభ విజయవంతం కోసం సోమవారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఫయ్యామ్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్ యాదవ్‌లతో కలిసి చేవెళ్లలో రెండు స్థలాలను పరిశీలించారు. షాబాద్ రోడ్డులోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్, పట్టణంలోని కేవీఆర్ గ్రౌండ్‌ను పరిశీలించారు. వీటి వివరాలను పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి సభను విజయవంతం చేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఇక్కడి నుంచే ప్రకటించనుండడం సంతోషంగా ఉందన్నారు.

ఏసీఆర్‌కు చేవెళ్ల టికెట్ ఇవ్వొద్దు

బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరనున్న వికారాబాద్ జిల్లాకు చెందిన ఏ చంద్రశేఖర్ చేవెళ్ల టికెట్ ఇవ్వద్దని, స్థానిక నాయకులకే కేటాయించాలని వసంతం, షాబాద్ దర్శన్, పామెన బీంభరత్ మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ దృష్టికి తెచ్చారు. ఈ విషయం అధిష్ఠానం చూసుకుంటుందని, వారి నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, సీనియర్ నాయకులు జనార్దరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, పీఏసీఎస్ చైర్మన్లు డీ వెంకట్‌రెడ్డి, జీ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వండర్‌లాలో అపశ్రుతి

గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి


మనోజ్‌కుమార్(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: వండర్‌లాలో అపశ్రుతి చోటుచేసుకుంది. రైడ్స్ చేస్తుండగా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గుండెపోటు వచ్చి మృతి చెందాడు. ఈ సంఘటన రావిర్యాల్ సమీపంలోని వండర్‌లాలో ఆదివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా కాశీంకోట మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన గుమ్మడి మనోజ్‌కుమార్(26) కూకట్‌పల్లిలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులు దుర్గప్రసాద్, వరప్రసాద్, గణేశ్, శ్రీకాంత్, ప్రశాంత్‌తో కలిసి వండర్‌లాకు వెళ్లారు. జాయింట్ వీల్ పూర్తి చేసి రోలర్ క్యాస్టు రైడ్ చేస్తుండగా మనోజ్ కుమార్‌కు ఛాతిలో నొప్పి వచ్చింది. వెంటనే వండర్‌లాలోని ఫస్ట్ ఎయిడ్ సెంటకు తీసుకెళ్లగా ట్యాబ్లెట్ ఇచ్చి పడుకోబెట్టారు. అప్పటికే పల్స్ రేట్ తగ్గిపోయి చల్లబడి పోయాడు. హార్ట్ బీట్ సరిగా లేదని స్నేహితులు గమనించే సరికి అంబులెన్స్‌లో యంజాల్ సమీపంలోని మహోనియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పెద్దాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో గాంధీకి తరలించారు. అప్పటికే మనోజ్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఆదిబట్ల పోలీసులు విచారణ చేస్తున్నారు. మనోజ్ కుమార్ మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పేదలకు భూమిని పంచాలి

అఖిలపక్ష నాయకుల తీర్మానం

ఇబ్రహీంపట్నం రూరల్: పోరాడి సాధించుకున్న భూమిని పేదలకు పంచాలని అఖిల పక్ష నాయకులు తీర్మానించారు. సోమవారం మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఎం, సీపీఐ బీజేపీ, బీఆర్‌ఎస్, బీఎస్పీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు వెంకటేశ్, జగన్ మాట్లాడుతూ.. 60 ఎకరాల భూములను పంచిన చరిత్ర సీపీఎంకు ఉందన్నారు. గతంలో భూపోరాటంలో సాధించుకున్న మూడెకరాల భూమిని నాయకత్వం వహించిన డేరంగుల నర్సింహ పేరిటి రిజిస్ట్రేషన్ చేయించగా.. ఆయన బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత భూమి తనదే అనడం తగదన్నారు.ముప్పై ఏళ్లుగా గ్రామానికి చెందిన 500 కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూమిని తన దుర్బుద్ధితో అతని కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడని ఆరోపించారు. అట్టి భూమిని పేదలకు పంచాలని ఎన్నో సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని పేదలకు చెందినభూమిని వారికే పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అండాలు, ఎంపీటీసీ సభ్యురాలు మంగ, ఉప సర్పంచ్ జంగారెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దానయ్యగౌడ్, బీజేపీ నాయకుడు గణేశ్, సీపీఐ నాయకులు యాదయ్య, మాజీ వైస్‌ఎంపీపీ శేఖర్‌రెడ్డి,, అశోక్, నర్సింహ, వెంకన్న, స్వామి, ధనేశ్వర్, బీఎస్పీ నాయకుడు గణేశ్ పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

క్లుప్తంగా

కళాశాలకు బయలుదేరిన విద్యార్థిని అదృశ్యం


లయ (ఫైల్)

పహాడీషరీఫ్: ఇంటర్మీడియట్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం ప్రాంతానికి చెందిన బోరిగే ఆనందం కూతురు లయ (16) మహేశ్వరం మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. అక్కడ హాస్టల్ సదుపాయం లేకపోవడంతో ఆమె తుక్కుగూడలో నివాసముంటోంది. ఈ నెల 8న కాలేజీకి వెళ్తున్నాని చెప్పి బయలుదేరిన బాలిక తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కళాశాల, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వాహనం ఢీ..

వృద్ధుడి మృతి


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ వెంకటేశ్

షాద్‌నగర్‌రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. స్కందాని రియల్ ఎస్టేట్ వెంచర్ వద్ద గుర్తుతెలియని వద్ధుడి(60)ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ వెంకటేశ్ ఘటనాస్థలిని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో శవాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే షాద్‌నగర్ పీఎస్‌లో సంప్రదించాలన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వృద్ధురాలి నిలువు దోపిడీ

- కుర్చీకి కట్టేసి ఆభరణాలు దోచుకెళ్లిన దుండగులు
- క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించిన పోలీసులు


కొల్కులపల్లిలో సత్తమ్మ ఇంటిని పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్‌రావు

ఆమనగల్లు: మూత్రవిసర్జనకు వెళ్లేందుకు తలుపుతీసిన వృద్ధురాలి మెడలోంచి నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన సంఘటన కొల్కులపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పలమల్ల సత్తమ్మ ఓ గదిని అద్దెకు తీసుకుని ఒంటరిగా ఉంటోంది. ఆదివారం రాత్రి 2గంటల సమయంలో మూత్రవిసర్జనకు తలుపు తీయగా.. అప్పటికే మాటు వేసిన ఇద్దరు దుండగులు ఆమెను ఇంట్లోకి తీసుకెళ్లి కుర్చీకి కట్టేశారు. అరిస్తే చంపేస్తామని బెదిరించి, ఒంటిపై ఉన్న నగలను తీసుకుని పరారయ్యారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్‌రావు, అదనపు డీసీపీ యాదగిరి, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు, మాడ్గుల సీఐ రాజశేఖర్ క్లూస్ టీంను తీసుకెళ్లి ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన బైక్
- ఇద్దరు యువకుల దుర్మరణం


రఘురాం నాయక్ (ఫైల్)


నవీన్(ఫైల్)

కడ్తాల్: అతివేగం ఇద్దరు ప్రాణాలను తీసింది. ఈ ఘటన మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ వద్ద శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన పెరుమళ్ల నవీన్(22), ఖానాపూర్ పంచాయతీ పరిధిలోని కర్కస్‌తండాకు చెందిన సభవట్ రఘురాం నాయక్(22) ఇద్దరు మిత్రులు సోమవారం రాత్రి బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కర్కల్‌పహాడ్ సమీపంలో పెట్రోల్ బంకు వద్ద ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టారు. దీంతో నవీన్ ఘటనాస్థలిలో మృతి చెందగా.. తీవ్రగాయాలైన రఘురాంనాయక్‌ను 108లో చికిత్సకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపారు.